ప్రజాశక్తి
గురువారం 6 ఏప్రిల్ 2023
5
శ్రీకాకుళం





ఢిల్లీలో కార్మిక, కర్షక ర్యాలీలో పాల్గొన్న జిల్లాకు చెందిన కార్మిక, రైతు, ప్రజాసంఘాల నాయకులు

ప'రేషన్'

- ఏ నెల ఏ సరుకు అందుతుందో తెలియని పరిస్థితి
- సక్రమంగా పంపిణీ కాని పంచదార, కందిపప్పు
- పంపిణీ తీరుకు అద్దం పడుతున్న రెండు నెలల గణాంకాలు
- నష్టపోతున్న పేదలు

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌లో ఏ సరుకు ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో పంచదార ఇస్తుండగా, కందిపప్పు పంపిణీ చేయడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో కందిపప్పు పంపిణీ చేసి పంచదార ఎగ్గొడుతున్నారు. గోధుమ పిండి కూడా ఏ ప్రాంతానికి ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. బియ్యం మాత్రమే అన్ని ప్రాంతాల్లో అందరికీ అందజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. తాము డిడిలు తీసినా సరుకు రావడం లేదని డీలర్లు, డిడిలు తీసిన వారందరికీ సరుకులు అందిస్తున్నామని అధికారులు ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారు. దీంతో కొద్ది నెలలుగా గ్రామీణ ప్రాంతాల్లో అరకొరే రేషన్ అందుతోంది.

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి, కవిటి

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం గతంలో బియ్యంతో పాటు పప్పు, పంచదార, ఆయిల్, చింతపండు తదితర ఏడు రకాల వస్తువులు అందించేవారు. తర్వాత కాలంలో బియ్యంతో పాటు పప్పు, పంచదార పండగ సమయాల్లో బెల్లం, నూనె, శనగలు తదితర వస్తువులు అదనంగా అందించేవారు. ప్రస్తుతం బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, గోధుమపిండి ఇస్తున్నారు. ఆ సరుకులు పేదలకు ఎప్పుడు అందుతాయో, ఎప్పుడు అందవో తెలియని పరిస్థితి నెలకొంది. ఉదాహరణకు కవిటి మండలం ప్రగడపుట్టుగ డిపోలో గతేడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది మార్చి వరకు చూసుకుంటే నవంబరు, జనవరి, ఫిబ్రవరిలో మాత్రమే బియ్యంతో పాటు పంచదార అందించారు. కందిపప్పు మాత్రం కేవలం ఫిబ్రవరిలోనే అందించారు. మిగతా నెలల్లో కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేశారు. కవిటి మండలంతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.



సరుకులు అందిస్తున్న రేషన్ వాహనాల ఆపరేటర్లు (ఫైల్ ఫొటో)

అరకొర రేషన్‌కు అద్దం పడుతున్న గణాంకాలు

జిల్లాలోని 1603 చౌకధరల దుకాణాల దారా గత రెండు నెలలుగా సాగిన పంపిణీ తీరు అరకొర రేషన్ పంపిణీకి అద్దం పడుతున్నాయి. ఫిబ్రవరిలో 6,61,827 మంది కార్డుదారులకు పంచదార (అర కేజీ చొప్పున) 2,83,497 ప్యాకెట్లు అందించారు. కందిపప్పు (కేజీ చొప్పున) 1,21,955 ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఇక గోధుమ పిండి (కేజీ చొప్పున) 98,366 క్వింటాళ్లను అందించారు. మార్చిలో 6,61,818 మంది కార్డుదారులకు 2,81,464 ప్యాకెట్ల పంచదార, 1,94,527 కందిపప్పు ప్యాకెట్లు ఇచ్చారు. గోధుమపిండి 1213.66 క్వింటాళ్లను అందించారు. రెండు నెలల కాలంలో కార్డుదారుల సంఖ్యలో పెద్దగా వ్యత్యాసం లేకున్నా అందించిన సరుకుల్లో మాత్రం భారీగా తేడా స్పష్టంగా కనిపిస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ

రేషన్ పంపిణీపై ఇటీవల కాలంలో క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భూ సర్వే, హౌసింగ్ తదితర అంశాల ఒత్తిడితో అధికారులు రేషన్ పంపిణీపై దష్టి పెట్టలేకపోతున్నట్లు తెలుస్తోంది. డిపోకు ఎంత సరుకు వస్తుంది, ఏమేం వస్తున్నాయి, పూర్తిస్థాయిలో పంపిణీ జరుగుతుందా అన్న విషయాలు ఫోన్ల ద్వారానే సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. చివరకు రేషన్ వాహనానికి సరుకులు అందించే సమయంలోనూ పర్యవేక్షణ ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి.

డిడిలు తీసినా సరుకులు రావడం లేదు

రేషన్ సరుకుల పంపిణీ ఒక్కో నెల ఒక్కో విధంగా ఉంటోంది. ఏ నెల ఏ సరుకులు వస్తున్నాయో తెలియడం లేదు. గతేడాది అక్టోబర్‌లో కందిపప్పు కోసం డిడిలు తీసినా నాలుగు నెలల వరకు రాలేదు. మార్చిలో బియ్యం మాత్రమే వచ్చాయి. వాటినే పంపిణీ చేశాం.

– బిమ్మొ సాహు, డీలర్, ప్రగడపుట్టుగ, కవిటి

డీలర్లందరికీ సరుకులు అందిస్తున్నాం



డిడిలు తీసిన డీలర్లకు సరుకులు పంపకపోవడమంటూ ఉండదు. సకాలంలో సరుకులు అందిస్తున్నాం. ఎక్కడైనా డిడిలు తీసిన తర్వాత సరుకులు రాలేదంటే మాకు తెలియజేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– పి.జయంతి, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

ఆరు నెలల్లో రెండు సార్లే ఇచ్చారు



ఆరు నెలల్లో మాకు కేవలం రెండు నెలలే పప్పు, పంచదార అందించారు. సరుకులు లేక ఇవ్వడం లేదా?, వచ్చినా మాకు పంపిణీ చేయడం లేదా అన్నది తెలియడం లేదు. రేషన్ బండి వచ్చినప్పుడు ఉంటేనే రేషన్ అందుతోంది. లేకపోతే ఆ నెల వదులుకోవాల్సి వస్తోంది.

– పెరియా శివాజీ, ప్రగడపుట్టుగ, కవిటి

జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు కృషి

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి – శ్రీకాకుళం

బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. జగ్జీవన్ రామ్ 116వ జయంతిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని అరసవల్లి కూడలిలో గల జగ్జీవన్ రామ్ విగ్రహానికి స్పీకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాపూజీ కళామందిర్‌లో జగ్జీవన్ రామ్ జయంతోత్సవాల్లో మాట్లాడారు. పార్లమెంట్ సభ్యునిగా 40 ఏళ్ల పాటు సేవలందించి పలు మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా పనిచేశారని తెలిపారు. 1935లో దళితుల సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. భారతదేశ వ్యవసాయాన్ని ఆధునీకరించడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా జగ్జీవన్ రామ్ పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని రచించింది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అయితే, జగ్జీవన్ రామ్ దళితులకు రిజర్వేషన్ రూల్స్ అమలు చేశారని చెప్పారు. నేటి యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆలిండియా దళిత రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు కంఠ వేణుకు ఇటీవల గౌరవ డాక్టరేట్ లభించడంపై స్పీకర్ దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ బి.శాంతి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఆర్.గడ్డెమ్మ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి రామారావు, తహశీల్దార్ వెంకటరావు, దళిత సంఘాల నాయకులు బొడేపల్లి నర్సింహులు, బోసు మన్మథరావు, ఎస్.వి రమణ మాదిగ, బి.నారాయణరావు, కె.రాంగోపాల్, తైక్వాండో శ్రీను, అంబేద్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు ఎన్.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి : కలెక్టర్

జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో యువత ముందుకు నడవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. అరసవల్లి కూడలిలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు.

సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు : ఎస్‌పి

సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ అని ఎస్‌పి జి.ఆర్ రాధిక కొనియాడారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకవైపు దేశ స్వాతంత్ర్యం కోసం, మరోవైపు సామాజిక సమానత్వం కోసం పోరాడి వివక్షను జయించిన పోరాట యోధుడు అని అన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు, డిఎస్‌పిలు ఎం.మహేంద్ర, ఎస్.బాలరాజు, డి.ప్రసాదరావు, ఎస్.వాసుదేవ్, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

నిజమైన హీరోలు రక్తదాతలే

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి – శ్రీకాకుళం

రక్తదానం చేయడం ద్వారా రక్తదాతలు ఎందరో ప్రాణాలను నిలుపుతున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునే రక్తదాతలే నిజమైన హీరోలని అన్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆలిండియా అల్లు అర్జున్ ఫ్యాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని స్పీకర్ బుధవారం ప్రారంభించారు. రక్తదానం చేసిన అల్లు అర్జున్ అభిమానులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలంటే మెగా ఫ్యామిలీ అభిమానులు ముందుంటారన్నారు.

అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను మాట్లాడుతూ వేసవి కాలంలో రక్తం కొరత ఎక్కువగా ఉంటుందన్నారు. అటువంటి క్లిష్ట సమయంలో అల్లు అర్జున్ అభిమానులు రక్తదానానికి ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ రక్తదానం చేసిన వారిలో ఎంతో మంది ఎన్నోసార్లు రక్తదానం చేసి ఎంతో మంది ప్రాణాలను కాపాడగలిగారన్నారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అభిమానులకు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంకు మేనేజర్ మణికంఠ ఆధ్వర్యాన సిబ్బంది రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన వారికి అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎం.సుధీర్ వర్మ, అఖిల భారత చిరంజీవి యువత ఉత్తరాంధ్ర కార్యదర్శి వైశ్యరాజు మోహన్, అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు తైక్వాండో నవీన్, భాను, తాళాడ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న స్పీకర్ సీతారాం

కొందరు మగాళ్లకు బాధ్యత ఉండదు

- అందుకే ఇల్లాలికి ఆర్థిక ఆసరా
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి – శ్రీకాకుళం

కొందరు మగవాళ్లు బాధ్యత చూపించరని, ఇల్లాలు మాత్రం అంతా తానై ఇంటిని నడుపుతుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలంలో ఎఫ్‌సిఐ రోడ్డులోని జి.ఎల్ ఫంక్షన్ హాల్‌లో ఆసరా పథకం లబ్ధిదారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోనూ, చుట్టూ ఉన్న బంధువుల దగ్గర నిలబెట్టేది ఇల్లాలే అని నిర్ధారణ అయిందన్నారు. ఇల్లాలికి గౌరవం పెంచేందుకే ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. కొంతమంది మగాళ్లు ఏమీ పట్టించుకోరని, అలాంటి వారిని పోరంబోకులుగా తయారయ్యారని అన్నారని తెలిపారు. తన కుటుంబం గురించి, తన భార్యా బిడ్డలు, తల్లిదండ్రుల గురించి పట్టించుకోని మగాళ్ల గురించి ఆ మాట అన్నాను తప్ప వేరే ఉద్దేశంతో కాదన్నారు. బాధ్యత లేని మగవాళ్లకు బదులు అన్ని బాధ్యతలు చూసుకునే ఇల్లాలికి పథకాలు వర్తింపజేస్తే ఎలా ఉంటుందని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆలోచన చేశారని చెప్పారు. పథకాలన్నీ అందుకుంటున్న జగన్‌కు ఓటేయకుంటే మీ చేతులు మీరు నరుక్కోవడమేనన్నారు. సంఘాల బలోపేతానికి ఆర్థిక క్రమశిక్షణ పాటించాలన్నారు. చంద్రబాబు చెప్పిన విధంగా జగన్ మాట తప్పిన దాఖలాలు లేవు. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట నిలుపుకున్న జగన్‌కు, ఇచ్చిన మాటను మరిచిపోయిన చంద్రబాబుకు మధ్య ఉన్న వ్యత్యాసాలను గమనించాలన్నారు. పథకాల అమలు అన్నది ఇవాళ డబ్బు వృథా అని చెప్పడం కొన్ని విపక్షాలు ఎంచుకున్న విష ప్రచారంలో భాగమన్నారు. పథకాల అమల్లో మధ్యవర్తులకు చోటే లేదని చెప్పారు. ఈ మార్పును గమనించి జగన్‌కు, మీకు సహాయం చేసిన ప్రభుత్వానికి, నాయకునికి ఓటు వేయకుండా ఉంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయన్నారు. ఇంత కష్టం కూడా వృథా అయిపోతుందని తెలిపారు. మహిళలకు సాయం చేస్తే వేస్ట్ అనిపించుకుంటారో, బెస్ట్ అనిపించుకుంటారో అన్నది మీ ఇష్టమన్నారు. కష్టమైనా, నష్టమైనా ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలూ నెరవేరుస్తున్నామన్నారు. అనంతరం నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, ఎంపిపి అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, ఎఎంసి చైర్మన్ ముకళ్ల తాతబాబు, అంబటి శ్రీనివాసరావు, చిట్టి జనార్ధనరావు, గేదెల చెంగలరావు తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గర్భిణిపై అనుచిత వ్యాఖ్యల ఘటనపై

సబ్ కలెక్టర్ విచారణ

ప్రజాశక్తి – టెక్కలి

కాన్పు కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి ఆదివారం రాత్రి 1 గంటకు వచ్చిన గర్భిణిపై మహిళా సిబ్బంది పరుష పదజాలంతో నోటికొచ్చినట్లు మాట్లాడిన ఘటనపై సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి బుధవారం తన కార్యాలయంలో ప్రాథమిక విచారణ చేపట్టారు. ఈ నెల 2వ తేదీ అర్ధరాత్రి మందస మండలం హొన్నాలికి చెందిన గర్భిణి దేవికినాయక్‌కు పురిటి నొప్పులు రావడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి అర్ధరాత్రి వచ్చారు. గర్భిణిపై, ఆమెను తీసుకొచ్చి ఆశా కార్యకర్తపై అక్కడి మహిళా సిబ్బంది నోటికొచ్చినట్లు మాట్లాడారు. హెచ్‌బి తక్కువ ఉందని వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించారు. ఆమెను 108లో శ్రీకాకుళం తరలిస్తుండగా నరసన్నపేట వద్ద నొప్పులు అధికమై మగ బిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బుధవారం తన కార్యాలయంలో సబ్ కలెక్టర్ విచారణ చేపట్టారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావు, గైనకాలజిస్టు జ్ఞాన ప్రసూనాంభ, ధనలక్ష్మి, హెడ్ నర్సు అరుంధతి, సిబ్బందిని వేర్వేరుగా విచారణ చేపట్టారు. గర్భిణి దేవకినాయక్‌కు రక్తం తక్కువగా ఉందని, హైబిపి ఉందని, అందుబాటులోమందులు లేనందున శ్రీకాకుళం రిఫర్ చేశామని సిబ్బంది సమాధానం ఇచ్చారు. గురువారం దేవకినాయక్ బంధువుల వివరణ తీసుకొని తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు.



విచారణ చేపడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

రేపట్నుంచి 'జగనన్నే మా భవిష్యత్'

ప్రజాశక్తి – నరసన్నపేట, ఆమదాలవలస

వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నని గెలిపించుకోవడం అందరి బాధ్యత అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నరసన్నపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కృష్ణదాస్, ఆమదాలవలసలో సీతారాం బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. పార్టీ తరుపున సచివాలయ కన్వీనర్లతో పాటు గృహ సారథులు తొలిసారి ప్రజలతో మమేకం కావడానికి ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. ఈనెల 7 నుంచి 20వ తేదీ వరకు 14 రోజుల పాటు 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక రాజకీయ పార్టీ కార్యకర్తలుగానే కాకుండా ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని తీర్చే బాధ్యత గల పౌరులుగా పనిచేస్తారని చెప్పారు. ప్రభుత్వ పనితీరుపై, పార్టీపై ప్రజల అభిప్రాయాన్ని, సంతృప్తిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటారన్నారు. ఇంటి యజమాని అనుమతితో వారి ఫోన్, ఇంటి డోరుపై స్టిక్కర్లను అతికించాలన్నారు. జగనన్న పాలనకు మద్దతు తెలిపేందుకు 8296082960 ఫోన్ నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఇంటి యజమానికి అభ్యర్థించాలని సూచించారు. ప్రతి గృహ సారథి వారికి కేటాయించిన క్లస్టర్లలో ప్రతిరోజూ 10 నుంచి 15 గృహాలను సందర్శించాలన్నారు.

గత ప్రభుత్వాల ఆలోచనలకు భిన్నంగా.. ప్రజల జీవితాల్లో, వారి జీవనశైలిలో వచ్చిన మార్పును కళ్లకు కట్టినట్టు చూపించడమే తమ లక్ష్యమన్నారు. సచివాలయాల ద్వారా వాలంటీర్లు క్షేత్రస్థాయి నుంచి తీసుకొస్తున్న సర్వేల ద్వారా పరిశీలిస్తే సుమారు 80 నుంచి 90 శాతం వరకు గుణాత్మక మార్పు కనిపిస్తోందని నిరూపితమైందన్నారు. ప్రతిపక్షాలు వికృత చేష్టలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ రథానికి అడ్డంపడే ప్రయత్నాలు, కుట్రలు చేస్తున్న దుష్టశక్తులకు ఈ కార్యక్రమం తగిన గుణపాఠం చెప్తుందన్నారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, ఎంపిపిలు ఆరంగి మురళి, వాన గోపి, జెడ్‌పిటిసిలు వరుదు నాగేశ్వరమ్మ, చింతు అన్నపూర్ణ రామారావు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు కోరాడ ఆశాలత గుప్త, చీపురు రాణి, పిఎసిఎస్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణదాస్ తదితరులు

వక్ఫ్ బోర్డు ఆస్తులపై సర్వే

ప్రజాశక్తి – ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలోని వక్ఫ్ బోర్డు ఆస్తులపై వక్ఫ్ బోర్డు అధికారుల బృందం బుధవారం సర్వే నిర్వహించింది. ఎపి వక్ఫ్ బోర్డు కమిషన్ ఆదేశాలతో ఇచ్ఛాపురంలో అనుభవంలో ఉన్న భూములు, స్థలాలు పరిశీలించింది. ఆక్రమణకు గురైన, అమ్మకాలు జరిపిన ఆస్తులపై తమ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం అధికారుల బృందం ముమ్మరంగా సర్వే చేపట్టింది. మసీదులు, శ్మశాన వాటికలు పరిశీలించింది. పూర్తి నివేదికను రాష్ట్ర వక్ఫ్ బోర్డు, జిల్లా అధికారులకు అందజేయడం జరుగుతుందని బృందం తెలిపింది. ఈ సర్వేలో వక్ఫ్ బోర్డు సర్వేయర్లు హనుమంతు, శివ, ఆడిటర్ ఇన్‌స్పెక్టర్ జెబి అబ్దుల్ సాదిక్ షేక్, సభ్యులు రియాజ్ ఖాన్, జోహార్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న సర్వేయర్లు

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి – పలాస

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ కార్యదర్శి రమేష్ చంద్ర సాహు అన్నారు. పలాస రైల్వే కాలనీలో శ్రామిక్ కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం అనంతరం పాదయాత్ర నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పని భారం రోజురోజుకూ పెంచుతున్నారన్నారు. కొత్త పింఛన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పాత విధానాన్ని కొనసాగించకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైల్వేలో మౌలికసదుపాల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులంతా సంఘటితంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ విరమణ పొందిన శ్రామిక్ కాంగ్రెస్ పలాస బ్రాంచ్ అధ్యక్షులు, చీఫ్ బుకింగ్ అధికారి జి.శివశంకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డివిజనల్ కో-ఆర్డినేటర్ సునీల్, చెర్ల రాజశేఖర్, శ్రీనివాస్ నిరంజన్, మిశ్రా, రవి చౌదరి, ఆర్.తాతారావు, కె.హరిప్రసాద్, వి.రామారావు, ఆర్.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



రైల్వే కాలనీలో పాదయాత్ర చేస్తున్న నాయకులు


బ్రహ్మోత్సవానికి ఆహ్వానిస్తున్న అమ్మోజి

సాహిత్యంతో సామాజిక చైతన్యం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సాహిత్యంతో సామాజిక చైతన్యం చేకూరుతుందని, దానికి కృషి చేస్తున్న శ్రీశ్రీకళావేదిక సేవలు అభినందనీయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రశంసించారు. శ్రీశ్రీకళా వేదిక, ఇంద్రాణి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు జాతీయ మీడియా ప్రతినిధి బమ్మిడి అమ్మోజి బుధవారం స్పీకర్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద కార్యక్రమం పోస్టర్, కళాకారుల ఆహ్వాన పత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ రికార్డుల్లో నమోదు చేసే విధంగా 48 గంటల పాటు నిర్విరామంగా కార్యక్రమం నిర్వహిస్తున్న చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కృషిని అభినందించారు. రెండు వేలకు పైగా ఒకే స్టేజిపై నిర్విరామంగా కళా ప్రదర్శనలు చేస్తున్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీశ్రీకళావేదిక ప్రతినిధులు స్పీకర్ తమ్మినేని సీతారాంకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టు రాజా, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ, జిల్లా జాయింట్ సెక్రెటరీ పిల్లా రామునాయుడు, వర్ధమాన రచయిత్రి కావ్య పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న డిఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి

ప్రయాణికుల భద్రతే ముఖ్యం

డిఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైల్వే ప్రయాణికుల భద్రతే ముఖ్యమని డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ కుమార్ సత్పతి అన్నారు. శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లోని ఆర్‌పిఎఫ్ బ్యారక్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే ఆస్తులు, ప్రయాణికుల భద్రత తదితర విధుల్లో అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్న ఘనత ఆర్‌పిఎఫ్ సిబ్బందికే దక్కుతుందన్నారు. సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి సిబ్బంది పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆర్‌పిఎఫ్ బ్యారక్ ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ చొక్కా రఘువీర్, సీనియర్ డిసిఎం అఖిలేష్‌కుమార్ త్రిపాఠి, ఆర్‌పిఎఫ్ ఒసి మనోజ్‌కుమార్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తపా, స్టేషన్ మాస్టర్ మొదలవలస రవి, రైల్వే చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ లోతింటి శివశంకర్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- పొందూరు

మహిళా సాధికారితే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరు వ్యవసాయ మార్కెట్ ఆవరణలో బుధవారం నిర్వహించిన మూడో విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబ గౌరవం పెంచేందుకు కృషి చేసే ఇల్లాలికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మహిళా అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. సంక్షేమ పథకాలు అమలులో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా చేరుతున్నాయని, ఇంతటి పారదర్శికత గతంలో ఏ ప్రభుత్వానికీ లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ సంక్షేమం సమన్యాయం జగనన్న ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు పిరియా విజయ మాట్లాడుతూ మహిళాభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రతిఒక్కరూ గుర్తించాలని కోరారు. అనంతరం


టెక్కలి : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

మండలంలోని 1319 స్వయం సహాయక సంఘాల్లోని 15,121 మంది సభ్యులకు రూ.9.45 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, సర్పంచ్ రేగిడి లక్ష్మి, ఎపిఎం గురుగుబెల్లి శ్యామలరావు పాల్గొన్నారు.

టెక్కలి : సమాజంలో మహిళలు ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం ఆసరా సంబరాల్లో భాగంగా మహిళలకు నమూనా చెక్కును అందించారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలో 692 మంది మహిళలకు రూ.9,72,98,500ను వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, సర్పంచ్ గొండేల సుజాత, మండల ఉపాధ్యక్షులు కిషోర్, పేడాడ రమేష్, వెలుగు ఎపిఎం శ్రీరాములు, నారాయణరావు, ఎంపిడిఒ జి.ఉమా సుందరి, వైసిపి నాయకులు పొన్నాన జగన్మోహనరావు, సర్పంచ్‌లు గుజ్జు మోహనరెడ్డి, రౌతు జయమోహనరావు, కె.కామేశ్వరరావు, దల్లి లోకేశ్వరరెడ్డి, బగాది హరి, పొందర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

'జగనన్నే మా భవిష్యత్' పోస్టర్ ఆవిష్కరణ

పలాస: ఈ నెల 7 నుంచి 'మా భవిష్యత్ నువ్వే జగన్.. మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం పోస్టర్‌ను ప్రగతి భవన్‌లో బుధవారం సాయంత్రం మంత్రి సీదిరి అప్పలరాజు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు వెంకటరావు, జెడ్‌పి వైస్ చైర్మన్ ప్రతినిధి శ్రీనివాస్, ధనరాజ్, సాయికృష్ణ, డి.దానయ్య, ఉదయకుమార్, ఎస్.సింహాచలం, గణపతి, కరుణాకర్, రవి, శేషగిరి, జి.వేణుగోపాల్, మధుకేశ్వరరావు, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

17న విద్యార్థికి రాష్ట్రపతి సన్మానం


మణికంఠ

రణస్థలం : మండలంలోని చిల్లపేటరాజాంకు చెందిన కొంతల మణికంఠకు అరుదైన అవకాశం లభించింది. మణికంఠ విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని కస్పా పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. రెండేళ్ల క్రితం టిసిఎస్ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపాడు. ఈ మేరకు ఈ నెల 17న రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మణికంఠను సన్మానించనున్నారని కస్పా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరరావు తెలిపారు. ఈ మేరకు మెయిల్ రూపంలో సమాచారం వచ్చిందని వివరించారు.

మైనింగ్ మాఫియాను విడిచిపెట్టేది లేదు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

ప్రకృతి సంపదను దోచేస్తూ పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న మైనింగ్ మాఫియాను ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టేది లేదని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం స్పష్టం చేశారు. మండలంలోని వి.ఆర్.గూడెం వద్ద అక్రమ గ్రావెల్ క్వారీలో ఇటీవల సంభవించిన ప్రమాదంలో విద్యార్థి మణికంఠ మృతి చెందిన స్థలాన్ని బుధవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ, మైనింగ్ అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలను చేపడుతున్న వారిపై ప్రభుత్వ పరమైన అన్ని చర్యలనూ తీసుకుంటామని తెలిపారు. క్వారీలు, క్రషర్స్‌ల్లో పనిచేసే కార్మికుల కోసం ఆలోచిస్తున్నానే తప్ప మైనింగ్ మాఫియాను విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. ఈ అక్రమ మైనింగ్ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సిబిసిఐడి విచారణ చేపట్టాలని కోరానని అన్నారు. దీంతో సిఎం విచారణకు


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ సీతారాం

ఆదేశించారని అన్నారు. కొండపై మొత్తం విస్తీర్ణం, అక్రమ మైనింగ్, విస్తీర్ణంకు జరిగిన పూర్తి వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలని మైనింగ్ డిడి ఫణిభూషణ్‌ను ఆదేశించారు. అధికారుల విచారణలో పూర్తిస్థాయిలో వివరాలు బయటకు వస్తాయని తెలిపారు. ఇటువంటి మైనింగ్ మాఫియాపై ప్రజలు తిరుగుబాటు చేయాలన్నారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలను అందిస్తామని భరోసానిచ్చారు.


సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

అర్హులందరికీ సంక్షేమం

లావేరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మురపాక-1 సచివాలయ పరిధిలో మురపాకలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కూడిన పోస్టర్లను అందజేశారు. సిఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ నవరత్న పథకాలు అందున్నవి లేనివి అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తనకు తెలియజేస్తే తక్షణ పరిష్కారం చూపుతానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు దన్నాన రాజినాయుడు, మురపాక సర్పంచ్ పెయ్యల నాగమణ, ఎంపిడిఒ సురేష్‌కుమార్, హౌసింగ్ ఎఇ అప్పలనాయుడు పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

'ఉపాధి' పనులు పరిశీలన

టెక్కలి : మండలంలోని కె.కొత్తూరు, విక్రంపురం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉంటున్న నేపథ్యంలో తగిన ఆరోగ్య జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సరోవర్ ట్యాంకు వర్క్ పరిధికి ఎంపికైన పనులపై ఎపిఒ ప్రసాదరావుకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈయనతో ఉపాధి సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి- కంచిలి

వైసిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని డిజిపురం సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న మా భవిష్యత్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. విజయ మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు. సారథులు, వాలంటీర్లకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అన్ని వర్గాల వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేసి, వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్మోహన్‌రెడ్డిని సిఎం చేసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఎక్కల పంచాయతీ పరిధిలో ఎక్కల- కేసరిపడ తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు గుమ్మడి రామదాసు, సర్పంచులు కె.సురేష్, రిషికేష్ పాత్రో, రంగాల గాయత్రి, కె.చంద్రమ్మ, ఎంపిటిసిలు హేమావతి, రాజు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న కృష్ణంనాయుడు

రిలీఫ్ ఫండ్ అందజేత

ఇచ్ఛాపురం : కవిటి పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన ఎఎస్ఐ డి.వి.భాస్కరావు విధి నిర్వహణలో గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. ఇచ్ఛాపురంలో నివాసం ఉంటున్న భాస్కరరావు భార్య భారతికి డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి తక్షణ సహాయం బుధవారం అందించారు. ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అసోసియేషన్ తరపున డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కులను అందించారు. కార్యక్రమంలో పోలీస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.కృష్ణంనాయుడు, కె.భుజంగరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, మాజీ అధ్యఓఉలు కెల్లి అప్పన్న, పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.గోవిందరావు, హెచ్‌సి టి.రామారావు, కవిటి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల్లో స్థలాలు కొని మోసపోవద్దు


మాలతి

సోంపేట : చెరువుల్లో వేస్తున్న ఇళ్ల స్థలాలను కొని ప్రజలు మోసపోవద్దని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఎం.మాలతి ఒక ప్రకటనలో కోరారు. సుప్రీం కోర్టు నిబంధనల మేరకు రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం చెరువుల్లో ఎవరు ఇళ్ల స్థలాలను కొనుగోలు చేయకూడదన్నారు. ఇదివరకే అటువంటివి ఏమైనా ఆక్రమణలు జరిగినట్లయితే దానికి పూర్తిగా అధికారుల బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. చెరువుల్లో ఇళ్లు నిర్మించినా వాటిని తప్పనిసరిగా తొలగించాల్సి ఉంటుందన్నారు. ప్రజలు ఇళ్ల స్థలాలు కొనేటప్పుడు అవి చెరువుల్లో ఉన్నాయా? లేవా? అనే విషయాలను పరిశీలించుకోవాలని కోరారు.

విశాఖ వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి- కవిటి


పింఛను అందిస్తున్న భవాని

మండలంలోని వరక గ్రామానికి చెందిన వాలంటీరు బెండి భవాని విశాఖపట్నం వెళ్లి కిడ్నీ రోగికి పింఛను అందించింది. తోటి వాలంటీర్లకు ఆదర్శంగా నిలిచింది. గ్రామానికి చెందిన కిడ్నీ రోగి ఎన్ని వెంకటేశం విశాఖలోని మెడికవర్ ఆస్పత్రిలో డయాలసిస్ చికిత్స పొందుతున్నారు. నెలలు దాటితే పింఛను రద్దయ్యే ప్రమాదం ఉండటంతో విశాఖలోని ఆస్పత్రికి వెళ్లి, వాలంటీరు పింఛను అందించారు. వాలంటీరును సర్పంచ్ ప్రతినిధి శ్రీకాంత్ పురియా, వెల్ఫేర్ అసిస్టెంట్ పొల్లాయి అశోక్, తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రణస్థలం రూరల్: మండలంలోని బంటుపల్లికి చెందిన జాడ బంగార్రాయుడు (70) విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం గెచ్చలవలస సమీపంలో బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు... బంగార్రాముడు కొన్నేళ్లు కాలు నొప్పులతో బాధపడుతున్నాడు. ఎప్పటికప్పుడు రాజాం వెళ్లి వైద్యం చేసుకునేవారు. అందులో భాగంగా బుధవారం మృతుడు కుమారుడు సూర్యనారాయణతో కలిసి బైక్‌పై రాజాం వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా గెచ్చలవలస వద్ద బైక్ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో చీపురుపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా... మార్గంమధ్యలో పరిస్థితి విషమించింది. సూర్యనారాయణకు కాలుకు తీవ్ర గాయమైంది. మృతునికి భార్య సత్యవతి, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానం


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని చూపిస్తున్న మోహనరావు

ఆమదాలవలస : పురపాలక సంఘంలోని డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, సక్రమ నిర్వహణకు కలెక్టర్ జోక్యం చేసుకొని చక్కదిందేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని ఎపి పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ బొడ్డేపల్లి మోహనరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి 17 వార్డు పూజారిపేట రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. ఈ మురుగునీటిని బుధవారం పరిశీలించి విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నపాటి వర్షం పడితే డ్రెయినేజీ కాలువల్లో వెళ్లాల్సిన మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుందని అన్నారు. పురపాలక సంఘానికి ప్రభుత్వం విడుదల చేస్తున్న ఆర్థిక సంఘం నిధులు ఏమైపోతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. ప్రజలతో చెత్త పన్ను, ఇంటి పన్ను తదితర పలు రకాల పన్నులను వసూలు చేస్తున్న ప్రభుత్వం... ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాల కల్పనలో ఎందుకు విఫలమవుతుందని ప్రశ్నించారు. పురపాలక సంఘానికి ఎన్నికలు జరగకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన మరింత వెనకబడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమితుల కాలం నాటి డ్రెయినేజీ వ్యవస్థతోనే నెట్టుకొస్తూ ప్రజలను ఇబ్బందులు గురి చేయడం భావ్యం కాదన్నారు. పారిశుధ్య విభాగంలో ఉండాల్సిన సిబ్బంది లేక ప్రజలకు సేవలు అందించడంలో పురపాలక సంఘ అధికారులు విఫలం అవుతున్నారన్నారు. ఎప్పటికైనా డ్రెయినేజీ, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి కలుగజేసుకోవాలని కోరారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- కొత్తూరు


కిట్లను అందజేస్తున్న జగన్మోహనరావు

దాతల సహకారంతో క్షయ వ్యాధి రోగులు కోలుకోవడానికి పోషక ఆహార కిట్లు అందిస్తున్నామని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని కురిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పౌష్టికాహార కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులు ఆహారాన్ని తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలన్నారు. తరచుగా పరిశుభ్రమైన నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రువ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అలాగే ఎవరైనా వడదెబ్బకు గురైన సత్వరం చల్లని నీడ, గాలి తగిలే ప్రదేశానికి చేర్చి తడిగుడ్డతో శరీరాన్ని తుడవాలన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు ద్రావణం, ఒఆర్ఎస్ ద్రావణం తాగించాలని సూచించారు. అనంతరం దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలించాలన్నారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొంచాడ సోమేశ్వరరావు, ఎ1 ఆస్పత్రి డాక్టర్ జి.ప్రమీల, ఎయిడ్స్, కుష్టు, టిబి నివారణ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారి డాక్టర్ ఎన్.అనురాధ, కొత్తూరు రెడ్‌క్రాస్ ఉపశాఖ చైర్మన్ పొగిరి రవి, సభ్యులు బి.చిన్మయిరావు, కె.సత్యనారాయణ, బి.శ్రీధర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎం.శ్రీలక్ష్మి, ఎంసందీప్ కుమార్, టివి అధికారిణి డాక్టర్ సాయిగీత పాల్గొన్నారు.

సంబరాల విజయవంతానికి కృషి


మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఈ నెల 17 నుంచి వచ్చే నెల 15 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించినున్న గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారు సంబరాలు సమిష్టి కృషితో విజయవంతం చేస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. బుదవారం ఆలయం ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. ఈ మేరకు సంబరాల నిర్వహణపై చర్చించారు. గ్రామ దేవత సంబరాలకు చురుగ్గా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పాత బస్‌స్టాండ్ కూడలి వద్ద బాహుబలి ప్రవేశ ద్వారం పనులు ముమ్మరంగా సాగుతున్నాయని అన్నారు. పట్టణంలో సంతపేట, ఇచ్ఛాపురం ప్రవేశం నుంచి గ్యాస్ కంపెనీ వరకు పూర్తిస్థాయిలో విద్యుత్ దీపాలంకరణ పనులు చేపడుతున్నామన్నారు. పదేళ్ల తరువాత నిర్వహిస్తున్న ఈ సంబరాలు విజయవంతానికి అందరికీ సహకారం అవసరమని కోరారు. సమావేశంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు : పనులను ప్రారంభిస్తున్న వెంకటరావుదొర

'ఉపాధి' పనులు ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట బానోజీనాయుడు పిలుపునిచ్చారు. రణస్థలం పంచాయతీలో ఉపాధి హామీ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలోని ప్రజలు ఎవ్వరు వలసలుపోకుండా ఉండేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా పంచాయతీ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి మజ్జి వెంకటరమణ, రామారావు, రమణ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ఉపాధి హామీ కింద గ్రామాల్లో చేపట్టే పనుల ద్వారా గ్రామీణ ప్రాంతం నుంచి వలసలను అరికట్టవచ్చని జిల్లా ప్రణాళిక సంఘం మాజీ అధ్యక్షుడు హనుమంతు వెంకటరావుదొర అన్నారు. మండలంలోని మహాదేవిపురం పోలినాయుడు చెరువులో ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు ఉపయోగపడతాయన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి టి.శ్రావణి, ఎంపిటిసి ప్రతినిధి టి.శాంతారావు, ఉపసర్పంచ్ టి.సుశీల, దివ్వల పాపయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


బూర్జ : పనులను ప్రారంభిస్తున్న గోవిందరావు

బూర్జ : మండలంలోని పి.ఎల్.దేవి.పేట, నరేంద్రపురం, సోమిదవలస గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఎంపిటిసి ప్రతినిధి, ఆప్కాస్ రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, సర్పంచ్ మజ్జి చంటి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గేదెల వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంతర పంటల సేద్యంతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస


చెరుకు పంటలో అపరాలు సాగు చేస్తున్న రైతు

అంతర పంటల సేద్యంతో అదనపు ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రేవతి అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడ, చేపెనపేట, గరిమెళ్లకొత్తవలస గ్రామాల్లోని రైతులు చెరుకు పంటలో అంతర పంటగా వేసిన పెసర పంటను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సాగు విధానాలను, అంతర పంటల వల్ల కలిగే లాభాలను వివరిస్తున్నారని తెలిపారు. చెరుకు పంటల్లో అపరాలు మినుము, పెసర వేసి రైతులు సాగు చేస్తున్నారని అన్నారు. చెరకు పంట అనేది ఏకదళ జాతికి చెందినదని, అందులో ద్విదల జాతికి చెందిన అపరాలను అంతర పంటలుగా వేసుకోవాలని సూచించారు. ఈ విధంగా చేయడం వల్ల ప్రధాన పంట చెరుకుకు కావాల్సిన ముఖ్య పోషకాలన్నీ సమృద్ధిగా అందుతాయని అన్నారు. ఆపరాలతో పాటుగా నవధాన్యాల సాగునూ చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం రైతులకు మేలు

సంతబొమ్మాళి: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ఎస్‌డిఎ పి.సింహాచలం అన్నారు. బుధవారం చిన్నతుంగాం, పెద్దతుంగాం గ్రామ రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఖరీఫ్ పంటలపై అవగాహన కల్పించారు. పొలాల్లో పచ్చిరొట్ట పైర్లు జీలుగ, జనుము, పిల్లిపెసర వేసుకోవాలని అన్నారు. మినుములు, పెసలు, కందుల, రాగులు, నువ్వులు, శనగలు, ఉలవలు, ఆవాలు, ఆకుకూరలు, కాయగూరలు రుతు పవనాలకు ముందు వేసుకుంటే భూమిసారం పెరుగుతుందన్నారు. నవధాన్యాల విత్తనాలు కావాల్సిన రైతులు 9553374146 పి.సింహాచలంను సంప్రదించాలని అన్నారు.


రైతులకు అందజేసిన నవధాన్యాలు


లావేరు : మొండిగోడలుగా మిగిలిన పూరిళ్లు

వెంకటాపురంలో ఐదిళ్లు దగ్ధం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని వెంకటాపురంలో మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంతో సంభవించిన అగ్నిప్రమాదంలో ఐదు పూరిళ్లు దగ్ధమైయ్యాయి. గాఢ నిద్ర సమయంలో ప్రమాదంలో ప్రమాదం జరగడంతో బాధితులు కట్టుబట్టలో మిగిలారు. మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో ఇళ్లలో ఉన్న సామగ్రిని కాపాడుకోలేక పోయామని బాధితులు వాపోయారు. ఈ ప్రమాదంలో డి.రాములు, శీల సూరప్పడు, రాముడు, అదపాక సత్యం, సతివాడ ఆదినారాయణలకు చెందిన పూరిళ్లు కాలిబూడిదైయ్యాయి. ఆస్తి నష్టం సుమారు రూ.7 లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ఇళ్లలో ఉన్న నిత్యావసర సరుకులు, ఆధార్, రేషన్‌కార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, దుస్తులు, విద్యుత్ మీటర్లు అగ్నికి ఆహుతయ్యాయని బాధితులు లబోదిబోమంటున్నారు. సమాచారం అందుకున్న రణస్థలం అగ్నిమాపక సిబ్బంది శకటంతో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బాధితులకు వైసిపి నేత, పెద్దలింగావలస సర్పంచ్ ప్రతినిధి లుకలాపు అప్పలనాయుడు బుధవారం పరామర్శించారు. అనంతరం చీరలు, దుప్పట్లు, నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బొంతు యల్లంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లోలుగులో కిరాణా షాపు...

పొందూరు: మండలంలోని లోలుగులో మంగళవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన పొట్నూరు సత్యనారాయణకు చెందిన కిరాణా షాపు దగ్ధమైంది. రాత్రి పై ఇంటిలో నిద్రిస్తుండగా ఒక్కసారిగా కిందన ఉన్న కిరాణా షాపు నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే బయటకు పరుగులు తీశారు. కిరాణా దుకాణంలోని సామగ్రి, ఫ్రిజ్, ఇన్వర్టర్స్, టివి కాలిపోయాయి. సమాచారం అగ్నిప్రమాదంపై సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించిందని, ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.


పొందూరు : దగ్ధమైన సామగ్రి

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్


మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు


టెక్కలి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సబ్ కలెక్టర్


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పలాస: అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా సంత మైదానంలో ఆయన విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మాజీ ఉప ప్రధానిగా సేవలు అందించిన గొప్ప యోధుడని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు, వైస్‌ఛైర్మన్ మీసాల సురేష్‌బాబు, సనపల సింహాచలం, ఎంఇఒ సిహెచ్ శ్రీనివాసరావు, డి.భవానీశంకర్, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి బల్ల గిరిబాబు పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కమిషనరు యాదం అప్పలస్వామి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మందస: ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ తిరుమలరావు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి: సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి రాహుల్‌కుమార్ రెడ్డి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ, దళిత హక్కుల పోరాట సమితి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు యడ్ల గోపి, వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎంపిపి కార్యాలయంలో ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, ఎస్‌సి బాలుర వసతి గృహంలో సమతా సైనిక్ దల్ జిల్లా కార్యదిర్శ చల్లా రామారావు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి రోణంకి ఉమా మల్లేశ్వరరావు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పేడాడ వెంకటరావు, సింగుపురం వినోద్, లతశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు పూలమాలేసి, నివాళులర్పించారు. వారితో పాటు జెడ్‌పిటిసి లోలాక్షి, ఎంపిపి దేవదాస్‌రెడ్డి, గుమ్మడి రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు లోపింటి నారాయణరావు, బిసిసెల్ రాష్ట్ర నాయకులు సనపల అన్నాజీరావు, దళిత నాయకులు రావాడ వెంకటరావు, మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారి ఎస్.వాసుదేవరావు, కిరణ్ సంతోష్, ఎస్ఇబి కార్యాలయంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.సునీల్ కుమార్, ఎస్ఐ హేమమందిరలు బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

శ్రీకాకుళం : శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఆవరణలో బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిఎస్‌డి ప్రొఫెసర్ సుధాకర్‌బాబు, డీన్ కె.మోహన్‌కృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ అరిసినాయుడు, పిఆర్ఒ మామిడి షణ్ముఖ, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ పెద్దింటి ముకుందరావు పాల్గొన్నారు.

కవిటి: బాబుజీ అంటూ ఆప్యాయంగా పిలువబడే బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు అజరామరమని ఎంపిపి కడియాల పద్మ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, ఎఎంసి వైస్ ఛైర్మన్ వై నీలయ్య, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎంపిటిసి పూడి నీలాచలం పాల్గొన్నారు.

సోంపేట : పట్టణంలోని భారతీ విద్యాసంస్థలో కరస్పాండెంట్, ఎంపిపి నిమ్మన దాస్ బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవిబాబు, ఎఒ పాపారావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం : స్వాతంత్ర సమరయోధుడిగా, సంఘసంస్కర్తగా, సమ సమాజ నిర్మాణం కోసం పోరాడిన నిత్య కృషివలుడు, మూడు దశాబ్దాలు పాటు కేంద్ర మంత్రిగా, దళిత ఉపప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ అని టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రణస్థలంలో జగజ్జీవన్ రామ్ 110వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 1986 వరకు ఏకధాటిగా 50 ఏళ్ల పాటు ఉత్తమ పార్లమెంటేరియన్‌గా కొనసాగి ప్రపంచ రికార్డు నెలకొల్పిన ఘనత జగజ్జీవన్ రామ్‌కే దక్కిందని పేర్కొన్నారు.

పోలాకి: మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ పరిపాలన అధికారి బి.సూర్యప్రకాష్ బాబూ జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ గిరిబాబు


కోటబొమ్మాళి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎంపిపి


సోంపేట : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపిపి దాస్


కవిటి : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపిపి పద్మ

పెట్టుబడులపై అవగాహన

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మనం ఏ రంగంలోనైనా పెట్టుబడులు పెట్టేటపుడు నిర్ణయాలు ఎలా తీసుకోవాలనే అంశంపై విశాఖకు చెందిన ఐఐఎం అసోసియేట్ ప్రొఫెసర్ బి.శ్రీరంగాచార్యులు వివరించారు. బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన 'డెసిషన్ మేకింగ్ విత్ స్ప్రెడ్ షీట్స్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తక్కువ పెట్టుబడులు పెట్టి ఎక్కువ లాభాలు ఆర్జించాలనుకుంటారని అందుకు అనుసరించాల్సిన పద్ధతుల గురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఆయనను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్‌ఎన్ రాజు సత్కరించారు.

డావిన్సీ చిత్రాలు ఎందరికో ప్రేరణ

పార్వతీపురం రూరల్: డావిన్సీ కళాత్మక చిత్రాలు అనేక శాస్త్రాలకు అవసరమైన ప్రాథమిక పరికల్పనలను అందించాయని ప్రముఖ చిత్రకారుడు చందనపల్లి గోపాలరావు అన్నారు. స్నేహకళా సాహితీ ఆధ్వర్యంలో బుధవారం వేదాంత జూనియర్ కళాశాలలో 'డావిన్సీ - కళ -జీవితం' పుస్తక పరిచయం నిర్వహించారు. మోహన్‌దాస్ అధ్యక్షత వహించిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోనాలిసా, ది లాస్ట్ సప్పర్ వంటి చిత్రాల ద్వారా ప్రపంచ స్థాయిలో ప్రసిద్ధి చెందినప్పటికీ ఆయన అనేక రంగాలలో గొప్ప ప్రతిభను కనబరిచిన బహుముఖ ప్రతిభాశాలి అన్నారు. ప్రముఖ సాహితీవేత్త గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ ఎన్నో కళలున్నప్పటికీ చిత్రకళ పట్ల ఉండే ఆసక్తి బాల్యం నుండే బయట పడుతుందన్నారు. సమావేశం లో రచయితలు మల్లిపురం జగదీశ్, పక్కి రవీంద్రనాథ్, సిరికి స్వామినాయుడు, చింత అప్పలనాయుడు, సి.హెచ్.పారినాయుడు, వి.కృష్ణమూర్తి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న రామచంద్రరావు

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు బకాయిపడ్డ కరువుభత్యం చెల్లించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని టెక్కలి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్.రామచంద్రరావు కోరారు. బుధవారం విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు అవసరమైన పాన్, ఆధార్ కార్డులు లింకు, ఇకెవైసి నమోదు, ఇన్‌కం ట్యాక్స్ లైఫ్ సర్టిఫికేట్స్ మంజూరు వంటి పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. అందుకు సంబంధించిన పనులన్నీ కార్యాలయంలో నిర్వహించేందుకు అవసరమైన సలహాలు, సూచనలపై పలువురు మాట్లాడారు. అంతకుముందు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. సమావేశంలో కె.ధనుంజయరావు, ఎం.లక్ష్మీనారాయణ, కోరాడ మోహనరావు, రెయ్యి పున్నయ్య, హరిశ్చంద్రరావు, బి.అయ్యబాబు, మల్లయ్య, ధర్మారావు, స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

'మజ్జి' కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- పలాస

ప్రముఖ న్యాయవాది మజ్జి ఆనందరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, పలాస పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ ఆనందరావు కుటుంబాన్ని బుధవారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందిగాం మండలం ప్రతాప్ విశ్వనాథపురం గ్రామానికి చెందిన మజ్జి ఆనందరావు పలాస ప్రాంతంలో న్యాయవాదిగా ప్రజలకు అనేక సేవలు అందించారని, ఆయన మృతి బాధాకరమని అన్నారు. అనంతరం లక్ష్మీపురానికి చెందిన మాజీ ఎంపిటిసి దువ్వాడ శ్రీనివాస్ మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట డొక్కరి రాజారావు ఉన్నారు.


పరామర్శిస్తున్న దువ్వాడ సోదరులు

భవన నిర్మాణాలు పరిశీలన

రేగిడి : మండలంలోని పెద్దశిర్లాం గ్రామంలో రూ.70 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రం, నాడు నేడు పాఠశాల భవనాల నిర్మాణాలను డిఇ జయప్రకాష్ బుధవారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీరాజ్ జెఇ రామకృష్ణారావుకు సూచించారు. గడువులోగా పూర్తిచేసి అన్ని హంగులతో అందజేయాలని సూచించారు. నిబంధనలు ప్రాప్తికి పనులు చేపట్టాలన్నారు. స్థానిక వైసిపి నాయకులు లెంక రాంబాబు, నాడు నేడు జెఇ దాలయ్య ఆయనతో పాటు ఉన్నారు.


మాట్లాడుతున్న కన్వీనర్ ప్రసాదరావు

కలెక్టర్ దృష్టికి సాగునీటి సమస్యలు

ఇచ్ఛాపురం: మండలంలో రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని రైతు కుల సంఘం కన్వీనరు జన్నెల ప్రసాదరావు అన్నారు. మండలంలోని కొలిగాంలో మండల రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న రైతుల కష్టాల్లో ఏ మార్పు రాలేదని అన్నారు. రైతుల ఆర్థిక సుస్థిరత చేకూర్చే దిశగా, వ్యవసాయాన్ని లాభదాయకం చేసేందుకు వ్యవసాయ రంగానికి సంబంధించి నెలకొని ఉన్న వివిధ ఆర్థిక, సాంఘిక పరిస్థితులను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన సూచనలకు రైతు కుల సంక్షేమ సంఘం పేరిట మండల రైతు సంఘాల నాయకుల రాజకీయ పార్టీలకు అతీతంగా తమ గళాన్ని రైతులు వినిపించారు. కూర్మారెడ్డి, సుగ్గు ఛత్రపతిరెడ్డి, దక్కత విశ్వేశ్వరరెడ్డి, గిన్ని బాలరాజురెడ్డి, మంగి బాబురావు, జోగుల దిలీప్ యాదవ్, చిరంజీవి, గుజ్జు ఢిల్లీరావు, సత్యనారాయణరెడ్డి, జగదీశ్‌రెడ్డి, హేమంత్‌రావు, పురుషోత్తంరెడ్డిపాల్గొన్నారు.

11 నుంచి ముత్యాలమ్మతల్లి జాతర

రణస్థలం రూరల్: మండలంలోని జె.ఆర్.పురం, గరికిపాలెం, సీతంవలస, గొల్లపేట, లావేటిపాలెం, పిడుగుపాలెం, లావేరు, రావివలస, పిన్నింటిపేట, దన్నానపేట, వెంకటేశ్వర కాలనీ తదితర గ్రామ పరిధిలోని ముత్యాలమ్మతల్లి జాతర ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు రోజుల పాటు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. యాత్రికులు పాల్గొని ఈ జాతరను విజయవంతం చేయాలని కోరారు.